కనికలమ్మ ఆలయానికి దారేది?



కనికలమ్మ గుడి వద్ద మొక్కులు తీర్చుకుంటున్న ఏదుట్ల గ్రామస్తులు

- శ్రావణంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆలయానికి దారి లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ప్రైవేట్ వ్యక్తులు
- అటవీస్థలం కబ్జాకు గురైందని ఆరోపిస్తున్న గ్రామస్తులు



కనికలమ్మ గుడి సమీపంలో బంతి భోజనం చేస్తున్న భక్తులు (ఫైల్)

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్ల గ్రామస్తులు ఏళ్లుగా గ్రామం నుంచి మున్ననూరు వెళ్లే దారి సమీపంలోని గుట్టల్లో కొలువుదీరిన కనికలమ్మ దేవతను ఆరాధిస్తున్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో గ్రామస్తులంతా కలిసి ఒకేసారి ఊరి బయటకు వెళ్లి కనికలమ్మకు నైవేద్యం సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. కానీ సుమారు రెండేళ్ల క్రితం కనికలమ్మ ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న పట్టా పొలాలను ప్రైవేట్ సంస్థలు సోలార్ ఏర్పాటు చేస్తామని రైతుల నుంచి 210 ఎకరాల సేకరించారు. ఆ తరువాత ఆలయానికి వెళ్లేందుకు దారి లేకుండా కంపెనీల యజమానులు పొలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆలయానికి వెళ్లేందుకు దారి వదలారని ఆందోళన చేస్తున్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు చొరవ తీసుకుని ఈ శ్రావణ మాసంలో కనికలమ్మకు మొక్కులు చెల్లించుకోవడానికి అనుగుణంగా దారి ఇప్పించాలని కోరుతున్నారు.

కబ్జా చేశారని ఆరోపణలు

ఏదుట్ల నుంచి మున్ననూరుకు వెళ్లే దారిలో సర్వే నంబరు 578 బై 3 సమీపంలోని గుట్టల సమీపంలో రైతుల నుంచి 210 ఎకరాలు కొన్న ప్రైవేటు కంపెనీలు.. అదనంగా గుట్టల స్థలాలు కబ్జా చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశాయని ఏదుట్ల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు భూమి సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

దారి వదలాలి



తాతల కాలం నుంచి మేము గ్రామస్తులంతా కలిసి ఒకేరోజు కనికలమ్మ గుట్టకు వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటాం. ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో గుట్ట మీదకి వెళ్లడానికి వీలు లేదు. శ్రావణంలో కనికలమ్మకు మొక్కులు తీర్చుకునేందుకు అవకాశం లేకుండా ఉంది. అధికారులు స్పందించి ఆలయానికి దారి చూపాలి. – విష్ణు, ఏదుట్ల

వన భోజనానికి వెళ్తాం



మా గ్రామస్తులంతా కలిసి ప్రతి ఏటా శ్రావణ మాసం రెండో వారంలో వన భోజనం చేయడానికి కనికలమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పెరగాలని వేడుకుంటాం. అమ్మవారి దయతో అందరం సల్లగా ఉన్నాం. మేము అక్కడికి వెళ్లి పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి. – రాజేష్‌చారి, ఏదుట్ల

అధికారులు స్పందించాలి



కనికలమ్మ దేవతకు ఊరంతా మొక్కులు తీర్చుకుంటారు. అంతటి మహిమ గల అమ్మవారిని చేరుకోకుండా ప్రైవేటు కంపెనీలు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం బాధాకరం. వాళ్ల పట్టా భూములతో పాటు అటవీ భూమిలో సైతం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలి. – తిరుపతిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు

క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



పాన్‌గల్: విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించేలా హెచ్‌ఎంలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కురుమూర్తినాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వామన్‌గౌడ్‌కు సన్మానం



వనపర్తి టౌన్: ప్రజాసేవలో జనానికి అండగా నిలిచినవారే నిజమైన నాయకులని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్‌గౌడ్‌ను సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించిన వారిని ప్రజలకు ఎన్నటికీ మర్చిపోరని, అలాంటి వారిలో వామన్ గౌడ్ ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో బైరోజు చంద్రశేఖర్, నిరంజనయ్య, నాయకంటి నరసింహశర్మ, గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, స్వామి, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి..



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగూడెంతండాకు చెందిన నానవత్ హేమవర్ధన్ నాయక్ ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆర్గానిక్ అగ్రికల్చర్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం వనపర్తిలోని ఆయన నివాసంలో విద్యార్థిని శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, జాత్రునాయక్, టిక్యానాయక్, మురళిసాగర్, దేవర్ల నరసింహ, చిట్యాల రాము, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి అభినందన

కొత్తకోట రూరల్: ఈనెల 10న నిర్వహించిన జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ పోటీల్లో పట్టణ కేంద్రంలోని కేపీఎస్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని వాగ్దేవి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ చంద్రహాసన్ రెడ్డి తెలిపారు. భూమి పునరుదర్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తికి సంబంధించిన పోటీలు నిర్వహించగా వాగ్దేవి ప్రతిభ కనబర్చారని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, యాజమాన్యం విద్యార్థినికి అభినందించారు.

బోరు మోటారు అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో తాగునీటి సమస్య అధికంగా ఉందని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులు ఖర్చు చేసి గ్రామంలో ఖాళీగా ఉన్న బోరులో దించేందుకు మోటారు, పైపులు అందించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు గురువారం బోరు మోటార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధయ్య, శ్రీశైలం, లక్ష్మణ్‌గౌడ్, కృష్ణ, నీల్‌కుమార్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు

కొల్లాపూర్: ఆంగ్ల సబ్జెక్టు బోధన అంశాలపై డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులకు పట్టణంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. శిక్షణ తరగతులను అకడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫోద్దీన్ సందర్శించారు. జాలీ ఫోనిక్స్ విధానంలో చిన్నారులకు ఆంగ్ల బోధన ద్వారా వారిలో సృజనాత్మకను వెలికి తీయవచ్చని ఆయన అన్నారు.

పచ్చదనంతోనే వాతావరణ సమతుల్యం



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: అమ్మ పేరుతో ప్రతి బీజేపీ కార్యకర్త ఒక మొక్క నాటాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు పట్టణ ప్రధాన కార్యదర్శి రాములు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ... భూమిపై 33శాతం పచ్చదనం ఉంటేనే వాతావరణ సమతుల్యం అవుతుందని, పెరుగుతున్న జానాభాతో అడువులు తరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు లేకపోతే వాతావరణంలో ఉష్ణోగ్రత్తలు పెరిగి వర్షపాతం తగ్గి, జీవ మనుగడు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగం సురేందర్, పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, ప్రధాన కార్యదర్శి రాయన్న, ఐటీ సెల్ కన్వీనర్ విజయ్‌సాగర్, పట్టణ నాయకులు శ్రీను, మురార్జీనాయక్, మల్లికార్జున్, శేఖర్, విజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి



పాన్‌గల్: జీపీలకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కలు వివరాలు సేకరించారు. మొక్కలను సిద్ధం చేయడంతో పాటు దానికి అనుగుణంగా గుంతలను తవించాలన్నారు. దీంతోపాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి



పాన్‌గల్‌లో విద్యార్థులు, వైద్య సిబ్బందిచే ర్యాలీ



గోపాల్‌పేటలో..

పాన్‌గల్: చిన్న కుటుంబం, చింత లేని కుటుంబం అని, కుటుంబ నియంత్రణ తప్పక పాటించాలని ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మైథిలి అన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంతో పాటు కేతేపల్లిలో వైద్య సిబ్బంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక జనాభా వలన కలిగే అనర్థాలు, చిన్న కుటుంబంతో కలిగే లాభాల గురించి వివరించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఆరోగ్య రక్షణ పద్ధతులు పాటిస్తూ ఆనందమైన జీవితం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది, డాక్టర్ క్లైవెన్‌మార్క్ ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ పాపులేషన్ డే పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు వరకు ర్యాలీ తీశారు. అధిక జనాభా వలన కలిగే నష్టాలు, ఆర్థిక ఇబ్బందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అంజలి, సీహెచ్‌ఓ సిద్ధగౌడ్, కౌసల్య, సీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని కొల్లాపూర్ కమాన్ చౌరస్తాలో జై హనుమాన్ బొలెరో అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని గురువారం ఎంవీఐ వాసుదేవరావు, ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని, ప్రతి వాహనదారుడు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ కాగితాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, జమదగ్ని, లోకేష్‌నాయక్, రామకృష్ణ, మక్బూల్, రామస్వామి, స్వామి, రమేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లికి చెందిన మీసాల రాజు ప్రమాదవశాత్తు గాయపడడంతో ఒక కాలు తీసేశారు. దీంతో బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వారి బంధువులు మీసాల వంశస్తులు రూ.50 వేలు పోగు చేసి గురువారం బాధితుడు రాజుకు అందజేశారు. కార్యక్రమంలో మీసాల కరుణాకర్, గోపాల్, రాముడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన శెటమోని గోవిందమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.5 వేల ఆర్థికసాయం పంపించారు. స్థానిక నాయకులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు గురువారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి ఎమ్మెల్యే పంపిన నగదున అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, నాగయ్య, వెంకటయ్య, బుడ్డయ్య, కొండయ్య, కురుమయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంగినేనిపల్లిలో బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న బంధువులు

మోకాలిపై కూర్చొని మహిళా కౌన్సిలర్ నిరసన



అమరచింత: వార్డులోని ప్రధాన సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదంటూ మహిళా కౌన్సిలర్ సింధు మోకాలిపై కూర్చొని నిరసన వ్యక్తం చేసిన ఘటన గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సింధు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో నాల్గో వార్డులోని ప్రజల అవసరాలకు ఉపయోగపడే రహదారిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మున్సిపల్ ఎదుట ఆందోళన చేసినా.. ఇప్పటి వరకు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిని కబ్జా చేశారని ప్రశ్నించిన తనపై కోర్టులో కేసు వేశారని, అలాంటి వ్యవహారంలో రహదారి కబ్జా అయిందని మున్సిపల్‌లోని కౌన్సిలర్లు అందరూ తీర్మానం చేసినా కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమ కాలనీవాసులకు న్యాయం చేయాలని, కబ్జాకు గురైన రహదారిని ప్రజల ఉపయోగం కోసం కేటాయించాలని కోరారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

నవాబ్ ఆలీ నవాజ్ జంగ్‌కు ఘన నివాళి

వనపర్తి టౌన్: హైదరాబాద్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో 1877లో పుట్టిన నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ జయంతిని తెలంగాణ ఇంజినీర్స్ డేగా జరుపుకోవడం ఆయన సాధించిన విజయాలకు నిదర్శనమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో తెలంగాణ నీటి పారుదల పితామహుడు నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ 147వ జయంతిని టీజీఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజా పనుల విభాగంలో సహాయ ఇంజినీరింగ్ విభాగంలో చేరి, నిజాం ప్రభుత్వ ప్రజా పనులు టెలిఫోన్ శాఖ కార్యదర్శిగా పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి చీఫ్ ఇంజినీర్ అయ్యారని కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్, జూబ్లీహాల్, అఫ్జల్‌గంజ్‌లోని సెంట్రల్ లైబ్రరీ, రిజర్వాయర్లు, డ్యామ్‌లు తదితర నిర్మాణాలు చేపట్టి నేటి ఇంజినీర్లకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నరసింహశర్మ, కౌన్సిలర్ నాగన్న యాదవ్, నాగరాజు, బాలేమియా, బాలస్వామి నాయుడు, కొమ్ము వెంకటస్వామి, డప్పు స్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఖిల్లాఘనపురం: ఉపాధ్యాయులు పాఠశాలలో అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంఈఓ ఉషారాణి అన్నారు. గురువారం మండలంలోని అప్పారెడ్డిపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించి ఇటీవలే బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మానం, నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆమె క్లస్టర్ జీహెచ్‌ఎం చెన్నప్ప, గ్రామ పెద్దలతో కలిసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సూర్యసంజీవ, నవీన్‌కుమార్, స్వామిగౌడ్, కమల, అఫ్రీన్, నళినిదేవి, ప్రమోద్‌ను శాలువాలు, పూలమాలలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు అవసరమైన మైక్‌ను అందించిన దాత పెబ్బేరు మండలం సూగూరుకుకు చెందిన బలుపరి నరేష్‌ను, విద్యార్థులకు నోట్‌బుక్కులు, స్టేషనరీ సామగ్రి అందించిన కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ విజయ్‌కాంత్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణమ్మ, సుభాష్, సురేష్, అలివేలు, మంజుల, సురేష్, శివ, అనిల్, గ్రామ పెద్దలు కృష్ణయ్య, నర్సింహారెడ్డి, శంకర్‌గౌడు, చెన్నయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బదిలీ, పదోన్నతిపై వెళ్తున్న, ఈ పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు గురువారం శాలువాలు, పూలమాలలతో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న పార్వతి, పదోన్నతిపై వెళ్తున్న హేమలత, రంగనాయకమ్మలను, పదోన్నతిపై పాఠశాలకు వచ్చిన జీహెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు నాగేశ్వరమ్మ, లక్ష్మమ్మ, శ్యామలను సన్మానించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మంజుల, రమాదేవి, గిరిజ, ప్రేమలత, దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



అప్పారెడ్డిపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, క్లస్టర్ జీహెచ్‌ఎం తదితరులు



పాన్‌గల్‌లో..

పీర్ల చావిడి భూములు కాపాడండి

అమరచింత: మండల కేంద్రంలోని పీర్ల చావిడీలకు చెందిన భూములు ఇతరుల చెరలో కబ్జాలో ఉన్నాయని, వీటిని పీర్ల సేవకులైన ముజావర్లకు చెందేలా చూడాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి స్థానిక మసీద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందించారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం కమిటీ సభ్యులు మక్తల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఆసూర్‌ఖానా పీర్ల చావిడికి చెందిన వ్యవసాయ భూమిని ఇతర వ్యక్తులు నకిలీ పాస్‌పుస్తకాలను సృష్టించి, వారి పేరిట పొలం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. వీటితో పాటు పట్టణంలోని పీర్ల చావిడి భూములు, రాజావళి దర్గా భూములు సైతం అన్యాక్రాంతమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా ఉమ్మడి జిల్లాలోనే అత్యంత వైభవంగా పీర్ల పండుగ అమరచింత పట్టణంలో జరుగుతుందని ఇమామే ఉస్సేన్ సవారి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈమేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని, వెంటనే తహసీల్దార్‌తో సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఖాజమైనోద్దీన్, అన్సారీ, తౌఫిక్, అస్సు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

పెబ్బేరు రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు వనపర్తి పట్టణంలోని మరికుంట నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ మాట్లాడుతూ కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్య అంధకారంలో ఉందని వాపోయారు. మొదట పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులపై చిన్నచూపు చూసిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, నాయకులు అనిత్, సాయి, రమేష్, నీలోత్పల్, వెంకటేష్, పూజ, శ్వేత, రాజవర్ధన్, లక్ష్మణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఖిల్లాఘనపురం: ఆస్పత్రికి వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే వారి నుంచి డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పుల్లారెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం ఆస్పత్రిలో కాన్పు కోసం వచ్చిన బాలింత నుంచి సిబ్బంది రూ.3 వేలు డిమాండ్ చేయడంతో గ్రామస్తులు, ఆశాకార్యకర్తలు గొడవ చేసిన ఘటన దినపత్రికల్లో ప్రచురితం అయింది. దీంతో స్పందించిన ఆయన గురువారం డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ సిబ్బందిని పిలిచి విచారించారు. ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్న మహిళ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. డబ్బులు ఇచ్చింది వాస్తవమేనని కానీ రూ.500 మాత్రమే ఇష్టంతో ఇచ్చామని వారు చెప్పినట్లు వైద్యాధికారి తెలిపారు. డబ్బులు ఎలా తీసుకున్నా తప్పేనని మొదటి సారిగా క్షమించినట్లు ఆయన సిబ్బందిని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవన్నారు.



సిబ్బందిని విచారిస్తున్న వైద్యాధికారి పుల్లారెడ్డి

గొర్రెల దొంగలు అరెస్టు: రిమాండ్‌కు తరలింపు



నిందితులను చూపుతున్న పోలీసులు

ఆత్మకూర్: వ్యవసాయ పొలంలో ఉన్న 18 కొండ గొర్రెపోతులను ఎత్తుకెళ్లిన ఘటనలో దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మోట్లంపల్లి శివారులో రైతు మణివర్ధన్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలో కొండ గొర్రెపోతులను పెంచుతున్నారు. ఈ క్రమంలో గత నెల 29వ తేదీన వాటిలో 18 జీవాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గురువారం సాయంత్రం పెట్రోలింగ్ చేస్తున్న తరుణంలో ఒక ఆటోలో నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా.. గొర్రెల దొంగతనం చేసినట్లు తేలినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలోని పగిడాలకు చెందిన ఎరుకలి రాజు, చిన్న మద్దిలేటి, మల్లికార్జున్, ఎరుకలి హరికృష్ణ తమ మహీంద్రా ఆటో ఏపీ39యుక్యూ0698 వాహనంలో 18 జీవాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వారి నుంచి రూ.90వేలు నగదు, ఆటో, బైకును స్వాధీనం చేసుకున్నామని, దుండగులకు సహకరించిన ఆత్మకూర్‌కు చెందిన ఎరుకలి పోషన్న పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. నిందితులను ఆత్మకూర్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును చేధించిన ఎస్‌ఐ నరేందర్, సిబ్బంది యుగంధర్, భీమయ్యను సీఐ అభినందించారు.

గ్రామాల్లో నేటి నుంచి పీర్ల అలాయ్ బలాయ్

అమరచింత: గ్రామాల్లో శుక్రవారం నుంచి పీర్ల పండుగ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ముస్లిం క్యాలెండర్ ప్రకారం మొహర్రం మొదటి రోజు నుంచి పది రోజుల పాటు ముస్లింలు సంతాప దినాలుగా పాటిస్తారు. మహ్మద్ ప్రవక్త మునిమనుమడు పవిత్ర మక్కా, మదీనా పట్టణాలను శత్రురాజైన యాజీద్ చెర నుంచి విడిపించేందుకు యాజీద్‌తో పవిత్ర యుద్ధం చేస్తారన్నారు. పదిరోజుల పాటు జరిగిన యుద్ధంలో యాజీద్ ఇమామే ఉస్సేన్‌ను ఓడించడం కష్టమని భావించి ఇమామే ఉస్సేన్ నమాజ్ చేస్తున్న సమయంలో వెనకాల నుంచి తలలు నరికి చంపేస్తాడు. దీన్ని అసూరగా భావించిన ముస్లింలు బాధతో పండుగను జరుపుకొంటూ తమ పూర్వీకులైన ఇమామే ఉస్సేన్‌తో పాటు వారి సోదరులను తలుస్తూ సంతాప దినాలుగా పాటిస్తారన్నారు.